## క్లుప్తంగా

### రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**నింద్ర:** మండంలోని రైతులు ఏపీఎఫ్ఆర్(ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రేషన్) నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రైతులు తమకు సంబంధించిన భూమి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. దీంతో ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ తదితర సహాయాలు పొందడానికి వీలుటుందని తెలిపారు. రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని కోరారు.

### పశువులకు వైద్య సేవలు

**నింద్ర:** పశు వైద్య శిబిరాల ద్వారా ప్రతి గ్రామంలో పాడి రైతులు తమ పశువులకు వైద్య సేవలు పొందాలని మండల పశు వైద్యాధికారి సాయి సంధ్య అన్నారు. మండలంలోని అగరం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మట్లాడుతూ పశువులకు సరైన చికిత్స అందించి వివిధ రోగాలను నయం చేయవచ్చునని తెలిపారు. రోగాలను అరికట్టేందుకు పాడి రైతులకు తగు సూచనలు ఇచ్చారు.

### రోడ్లపై పేడ దిబ్బలు వేస్తే జరిమానా

**కార్వేటినగరం:** రోడ్లపై పేడ దిబ్బలు వేస్తే జరిమానా తప్పదని ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ నాగరత్నమ్మ పేర్కొన్నారు. శుక్రవారం మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో పచ్చికాపల్లం రోడ్డు, డైట్ రోడ్డు, చాకలివానిగుంట, పద్మసరస్సు రోడ్లను సర్పంచ్ ధనుంజయవర్మతో కలసి పర్యటించారు. రోడ్లపై వేసిన పేడ దిబ్బలను జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ నారగత్నమ్మ మాట్లాడుతూ.. నిత్యం రాకపోకలు సాగించే రోడ్లపై పేడ దిబ్బలు వేసి జన సంచారానికి ఆటంకం కలిగిస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

### బాలికల వసతిగృహం తనిఖీ



వసతిగృహంలో బాలికలతో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ శ్రీదేవి

**గంగాధరనెల్లూరు:** జీడీ నెల్లూరు మండల కేంద్రంలోని బాలికల సంక్షేమ వసతి గృహాన్ని జిల్లా డీఆర్డీఏ పీడీ, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వసతులు, మెనూ ప్రకారం అందాల్సిన ఆహారంపై విద్యార్థులను నేరుగా అడిగి వివరాలు సేకరించారు. విద్యార్థుల హాజరు పట్టిక, హాస్టల్ సిబ్బందికి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దీన్ని రోడ్డంటారా?



గుంతలతో నిండిన మహదేవమంగళం రోడ్డు

**గంగాధరనెల్లూరు:** తమ గ్రామానికి రోడ్డు వేసి ప్రాణాలు కాపాడాలని మహదేవ మంగళానికి చెందిన ప్రజలు వాపోతున్నారు. మండలంలోని మహదేవ మంగళం గ్రామానికి చేరుకోవడానికి రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిందని, కొద్ది రోజుల కిందట స్థానిక దళితవాడకు చెందిన కుప్పయ్య చెరువు కట్టపై ప్రయాణిస్తూ ప్రమాదానికి గురై మృతి చెందాడని వాపోయారు. గ్రామానికి రాత్రి పూట చేరుకోవాలంటే లైట్లు కూడా లేవని ఆందోళన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వంలో తమ గ్రామానికి రోడ్డు మంజూరు అయిందని, అలాగే మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రత్యేకంగా చెరువు కట్ట అభివృద్ధి కోసం, చెరువుపై రోడ్డు వేయడానికి నిధులు మంజూరు చేయించారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో రోడ్డు ఎప్పుడు వేస్తారోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

---

- అవస్థల నడుమ ఆఖరి మజిలీ
- శ్మశానాల్లో కనిపించని కనీస వసతులు
- నీటి కోసం ఆమడ దూరం వెళ్లాల్సిందే..
- ముళ్లకంపలతో నిండిన శ్మశానాలు
- సరైన దారి సౌకర్యం సైతం లేని వైనం

# చచ్చినా చావే..!





కనీస సౌకర్యాలకు నోచుకోని టీవీఎన్ఆర్ పురం శ్మశానవాటిక, (ఇన్‌సెట్) నిరుపయోగంగా ఉన్న షెడ్

**పాలసముద్రం మండంలోని పలు శ్మశాన వాటికలు దయనీయంగా మారాయి. చనిపోయిన వారికి ఘనంగా అంతిమ సంస్కారాలు చేయాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కనీస వసతుల్లేవు. ఎటు చూసినా ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలతో శ్మశానవాటికలు కనిపించడం లేదు. నీటి కోసం ఆమడ దూరంలోని వ్యవసాయ బావుల వద్దకు పరుగులు తీయాల్సిన దుస్థితి. దారులు సైతం లేక వ్యవసాయ పొలాల గట్లపై వెళ్లాల్సి వస్తోందని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు.**

**పాలసముద్రం:** మండలంలో కన్నికాపురం ఎస్టీ కాలనీ శ్మశానవాటిక ఆక్రమణకు గురైంది. గంగమాంబపురం దళితవాడ, ఆదిఆంధ్రవాడ, శ్రీకావేరిరాజుపురం, క్రిష్ణజమ్మాపురం, కన్నికాపురం, క్రిష్ణజమ్మాపురం బీసీ కాలనీ శ్మశానవాటికలు దుస్థితిలో ఉన్నాయి. దీంతో చనిపోయిన వారికి అంతిమ సంస్కారాలు చేయాలంటే కుటుంబ సభ్యులు, బంధువులకు తిప్పలు తప్పడం లేదు. రహదారి సౌకర్యం లేదు. కాలి బాటలు, తుప్పలు, డొంకలతో నిండిన దారుల్లో మృతదేహాలను తరలించేందుకు బంధువులు నానా అవస్థలు పడుతున్నారు. దహన సంస్కారాలకు అవసరమైన నీటిని ఫర్లాంగు దూరం నుంచి తెచ్చుకోవాల్సి వస్తోంది. పలుచోట్ల శ్మశానవాటికల్లో ఏర్పాటు చేసిన విశ్రాంతి భవనాలు శిథిలావస్థకు చేరాయి. వాటిని పట్టించుకునే నాథుడు లేడని స్థానికులు వాపోతున్నారు. మండలంలోని అనేక శ్మశానవాటికల్లో అంత్యక్రియల సమయంలో నిలువ నీడ కూడా లేదు. ఎండకు చెమటలు చిందిస్తూ, వానల్లో తడస్తూ అంత్యక్రియలు పూర్తి చేయాల్సి వస్తోంది.

**రాకపోకలకు ఇబ్బంది**

గంగమాంబపురం దళితవాడ, ఆదిఆంధ్రవాడ, కేజేపురం గ్రామ శ్మశానవాటికలకు వెళ్లేందుకు దారి లేదు. కలపాక, పాలసముద్రం శ్మశానవాటికల్లో ముళ్ల పొదలు దట్టంగా పెరగడంతో మృతదేహాన్ని తీసుకెళ్లడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది.



ఆదిఆంధ్రవాడలో శ్మశానం లేక మృతదేహాన్ని రోడ్డు పక్కనే పూడ్చిన వైనం



పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉన్న పాలసముద్రం శ్మశానవాటిక

**ప్రహరీ గోడ నిర్మించాలి**



శ్మశానవాటిక చుట్టూ గోడలేక దహన సంస్కారాల సమయంలో అటువైపు రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు భయపడుతున్నారు. పాలసముద్రం దళితవాడ శ్మశానవాటికలో వీధి దీపాలు లేవు. రాత్రిళ్లు దహన సంస్కారాల నిర్వహణ ఇబ్బందిగా ఉంది. అధికారులు చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి, విశ్రాంతి భవనానికి మరమ్మతులు చేపట్టాలి.

–ఆరుముగం, పాలసముద్రం, దళితవాడ

**మౌలిక వసతుల్లేవు**



మండలంలో అన్ని శ్మశానవాటికల్లోనూ మౌలిక వసతులు లేవు. విశ్రాంతి భవనాలు లేవు. మృతదేహాలను దహనం చేయడానికి షెడ్డు లేదు. నీళ్లు కావాలంటే కిలోమీటరు దూరం వెళ్లాల్సి వస్తోంది. సరైన రహదారి సౌకర్యం లేదు. గంగమాంబపురం, ఆదిఆంధ్రవాడకు శ్మశావాటికలు లేవు. ఉన్న శ్మశాన వాటిక వర్షపు నీటితో నిండిపోయింది.

–రేఖ, గంగమాంబపురం, దళితవాడ

**అధికారులకు చెప్పినా ఫలితం లేదు**



మండలంలోని అన్ని శ్మశానాల్లో మౌలిక వసతులు కల్పించాలి. మా గ్రామానికి చెందిన శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. కొన్ని గ్రామాలకు శ్మశానాలు లేకపోవడంతో మృతదేహాలను చెరువులో ఖననం చేస్తున్నారు. ఎమ్మెల్యే థామస్ స్పందించి శ్మశానాలకు స్థలాలు కేటాయించాలి.

–అనురేఖ, సర్పంచ్, ఆముదాల

---

### 10న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



పోస్టర్లను విడుదల చేస్తున్న కమిషనర్

**పుత్తూరు:** ఈ నెల 10వ తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి సిబ్బంది సిద్ధంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్ సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం తర్వాత విద్యార్థులందరికీ పంపిణీ చేపట్టాలని తెలిపారు. అనంతరం నులి పురుగుల కార్యక్రమం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ తిరుమలరాజు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

### ఇంటి స్థలాలు పరిశీలన

**విజయపురం:** మండలంలో కేవీపురం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చిన ఇంటి స్థలాలను తహశీల్దార్ కిరణ్ శుక్రవారం పరిశీలించారు. గత ప్రభుత్వం కేవీపురం పంచాయతీ పరిధిలో సర్వే నెంబర్ 183లో 85 మందికి ఇంటి స్థలంతోపాటు పట్టాలు ఇచ్చింది. అయితే ఎస్సీలకు సంబంధించిన ఇంటి స్థలాలను లబ్ధిదారులకు అప్పగించకపోవడంతో రెండు వారాల క్రితం సీపీఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ భూములను పరిశీలించారు. త్వరలో పట్టాల ఆధారంగా ఇంటి స్థలాలు అప్పగిస్తామని తెలిపారు.

### నేడు విద్యుత్ అంతరాయం

**పుత్తూరు:** శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీ ట్రాన్స్‌కో ఏఈ సాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈశ్వరాపురం, లక్ష్మీనగర్, కళ్యాణపురం వద్ద గల 33/11 కేవీ సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

**పాలసముద్రంలో...**

**పాలసముద్రం:** శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యుఓ శ్రీనివాసులు

**కార్వేటినగరం:** పేద విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే విద్యతోనే సాధ్యమని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహ కళాశాలలో వసతిగృహాల్లో ఉన్న పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ-ప్రేరణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌డబ్ల్యూఓ మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలనకు విద్య ఒక ఆయుధమన్నారు. గతంలో వసతిగృహాల్లో విద్యనభ్యసించిన వారు ఎందరో ఉన్నత శిఖరాలకు ఎదిగారని అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం డిగ్రీ కళాశాల అధ్యాపకుడు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు పదో తరగతి ఒక మలుపు అన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించిన విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోగలరని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీనరసింహా విద్యాసంస్థ డైరెక్టర్లు దిలీప్‌కుమార్, ధనుంజయరెడ్డి, వసతి గృహ వార్డన్లుహేమలత, చంద్రకళ, దశరథన్, సుబ్బరత్నమ్మ, వాసు, డిగ్రీకళాశాల అధ్యాపకులు సీఎస్ లత, సుబ్బారావు, రఘురాం, జోగిప్రసాద్ పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## అజాగ్రత్తతో పెనుముప్పు



మాట్లాడుతున్న డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్

**నగరి:** చిన్నపాటి అజాగ్రత్త పెను ముప్పును కలిగిస్తుందని డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన ప్రయాణంలో చిన్న అజాగ్రత్త తమ ప్రాణాలతోపాటు ఎదుటి వారి ప్రాణాలకు ముప్పు కలిగిస్తుందన్నారు. శరీరంలో ముఖ్య భాగమైన తలకు హెల్మెట్‌ను మాత్రమే ధరించాలని కోరుతున్నా పలువురు పెడచెవిన పెడుతున్నారన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారు ప్రయాణంలో సీట్ బెల్ట్ ధరించాలన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ భాస్కర్ రాజు, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వేణుగోపాల్, అకడమిక్ కోఆర్డినేటర్ మహేశ్వరి, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ స్వాతి, గిరీష్ కుమార్, శ్రీలక్ష్మి, సుహాసిని, రమేష్, ఉమా మహేశ్వరి, జేకేసీ మెంటార్ లాల్ బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అభ్యసనా సామగ్రి అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

## పాఠశాలకు చేయూత

**వెదురుకుప్పం:** మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఇన్ఫినిటీ ఫిన్‌కార్ప్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (గృహ రుణాల కంపెనీ) వారు సంస్థ తరఫున చేయూతనిచ్చారు. పాఠశాలకు అవసరమైన రెండు బీరువాలు, 20 కుర్చీలు, సౌండ్ సిస్టమ్‌ను వితరణ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. అదే విధంగా పాఠశాల విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్, జామెట్రీ బాక్సులు అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ రవాల్కర్ మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. దాతలు చేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని మరింత ముందుకు సాగాలని హెచ్ఎం శ్రీనివాసులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో తిరుపతి బ్రాంచి మేనేజర్ మోహన్, సంస్థ ప్రతినిధులు శివ, మురళీ, వినాయకరెడ్డి, గోపి, లోకేష్, దామోదరరెడ్డి, పీడీ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ప్రతి సోమవారం ఫిర్యాదులకు పరిష్కారం



మంజునాథ్‌గౌడ్

**పుత్తూరు:** ఇకపై ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యాలయ మీటింగ్ హాల్‌లో ప్రజలు హాజరై ఫిర్యాదులు చేయవచ్చునని వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా అందే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించనున్నట్లు వివరించారు.

### చెత్త సేకరణ ఆటో ప్రారంభం

**గంగాధర నెల్లూరు:** మండలంలోని తూగుంద్రం పంచాయతీలో చెత్తను సేకరించే ఆటోను శుక్రవారం స్థానిక సర్పంచ్ శ్రీబాబు గ్రీన్‌అంబాసిడర్లతో కలిసి ప్రారంభించారు. పంచాయతీ నిధులతో ఆటోను కొనుగోలు చేసినట్లు తెలిపారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా బండ్లలో వేయాలని ప్రజలను కోరారు. కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

### మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

**వెదురుకుప్పం:** మండలంలోని పెరుమాళ్లపల్లె గ్రామంలో మాజీ సర్పంచ్ రమేష్‌యాదవ్ కుటుంబాన్ని మాజీ ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌మురళీ పరామర్శించారు. రమేష్ తల్లి కనకరాజమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామంలో పర్యటించిన నాయకులు మృత దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక సర్పంచ్ శశికుమారి, మాజీ సర్పంచ్ హనుమంతరెడ్డి, రామకృష్టారెడ్డి, చెంగల్‌పందు రెడ్డి ఉన్నారు.

### వరిలో సస్యరక్షణ తప్పనిసరి

**బంగారుపాళెం:** వరి సాగులో తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు పాటించాలని చిత్తూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సంధారాణి స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని చీకూరుపల్లెలో సాగు చేస్తున్న వరి పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వరికి అధికంగా యూరియా వేస్తే తెగుళ్ల సోకే ప్రమాదముందన్నారు. వరిని ఆశించే అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 మిల్లీ గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. లేదా కాసుకామైసిన్ 2.5 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసినా ఫలితం ఉంటుందని వెల్లడించారు.

## విద్యాభివృద్ధికి దాతల ప్రోత్సాహం



యశ్వంత్‌కు ప్రోత్సాహక నగదు బహుమతిని అందిస్తున్న దాతలు

**కార్వేటినగరం:** విద్యాభివృద్ధికి దాతల ప్రోత్సాహం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి ఎం.విజయకుమార్ అన్నారు. శుక్రవారం ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందించారు. అనంతరం పాఠశాల కమిటీ చైర్మన్ షేక్ సందాని మాట్లాడుతూ.. ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన వారు ఎందరో ఉన్నత స్థాయిలో ఉన్నారని అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని విద్యనభ్యసించాలన్నారు. అనంతరం 2023-24 విద్యా సంవత్సరంలో పదో తగతిలో 588 మార్కులు సాధించిన యశ్వంత్‌కి రూ.33 వేలు, అలాగే ద్వితీయ స్థానంలో నిలిచిన సింధూ, చైతన్యలకు రూ.5 వేలు చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 మనోజ్ కుమార్, కోదండపాణి, పలువురు దాతలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పలువురు పాల్గొన్నారు.

## పారిశుధ్యం మెరుగు పరచాలి



మాధవరంలో డపింగ్ యార్డ్ వద్ద డీఎల్‌పీఓ

**విజయపురం:** గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగు పరచాలని డీఎల్‌పీఓ పార్వతి అన్నారు. శుక్రవారం మాధవరం, పన్నూరు, స్వామిరెడ్డికండ్రిగ పంచాయతీల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డంపింగ్ యార్డులో వానపాముల ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేసి, రైతులకు విక్రయించి, అందులో వచ్చే నిధులను గ్రామీణాభివృద్ధికి ఉపయోగించుకోవాలని సర్పంచ్‌లకు సూచించారు. తడి, పొడి చెత్తలను వేరు చేయాలని, పారిశుధ్యం లోపించకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మమత, కార్యదర్శి సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తీస్తే చర్యలు తప్పవు



ఇసుక ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ

**నగరి:** ప్రజావసరాలకు కాకుండా వ్యాపార నిమిత్తం ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ ఇసుక రవాణా చేసేవారిని హెచ్చరించారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఇసుక రవాణా చేసే ట్రాక్టర్ల యజమానులకు, డ్రైవర్లకు పోలీస్ స్టేషన్‌లో సమావేశపరచి హెచ్చరికలు జారీ చేశారు. తమిళనాడుకు సరఫరా చేసినట్లయితే కేసులు నమోదు చేసి అవసరమైతే పీడీ యాక్ట్ కూడా పెడుతామన్నారు. ప్రతి ట్రాక్టర్‌కు జీపీఎస్ అమర్చుకోవాలన్నారు. అవసరాలకు మాత్రమే ఇసుకను తీసుకోవాలని వ్యాపార ఉద్దేశంతో ఇసుక తరలిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. నగరి మీదుగా కుశస్థలి నదిలో ఉన్న ఇసుకను సత్రవాడ, కేవీపీఆర్ పేట, తెరణి, మిట్టపాళెం, ఏకాంబరకుప్పం ఏరియాల్లో జనసంచారం, ప్రజలు ఉన్నచోట ట్రాక్టర్లని అతివేగంగా నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. ఉదయం 7 నుంచి 11 వరకు సాయంత్రం నాలుగు తర్వాత ట్రాఫిక్ ఉన్న పట్టణ ఏరియాలో రవాణా చేయకూడదన్నారు. లైసెన్సు లేని డ్రైవరు ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మహేశ్వర్, ఇసుక ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణే లక్ష్యం



కార్వేటినగరంలో వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



విజయపురం: పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

**విజయపురం:** ఈ నెల 10న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను డాక్టర్ సోమశేఖర్ శుక్రవారం ఎంపీడీఓ రాజేంద్ర చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సోమశేఖర్ మాట్లాడుతూ మండలంలో ఒకటి నుంచి 19 సంవత్సరాల్లోపు బాలబాలికలు నులిపురుగుల మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 10న నులి పురుగుల మాత్రలు ఉచితంగా ఇస్తారని తెలిపారు. పిల్లలు చేతులు శుభ్రపరచుకునేలా, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**పాలసముద్రంలో..**

**పాలసముద్రం:** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రాజేంద్రప్రసాద్, వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నులిపురుగుల నివారణ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళి, మండల విస్తరణాధికారి రమేష్, ఏఎ మధువాణి, నాగభూషణం, గణేష్ పాల్గొన్నారు.

**కార్వేటినగరంలో..**

**కార్వేటినగరం:** నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని ఎంపీడీఓ చంద్రమౌళి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ వాల్‌పోస్టర్లను అధికారులతో కలసి ఆవిష్కరించారు. సచివాలయ మహిళా పోలీసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ చిన్నరెడ్డప్ప

**పాలసముద్రం:** విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పాలసముద్రం ఎస్ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. శుక్రవారం పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ హేమలత ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చిన్నరెడ్డప్ప మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం, పొగాకు ఉత్పత్తుల వినియోగంతో కలిగే అనర్థాల గురించి వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. విద్యార్థులకు ఎటువంటి సమస్య ఉన్నా నంబరు 100, చైల్డ్ లైన్ నంబర్ 1098కు ఫోన్ చేయాలని సూచించారు. ముఖ్యంగా అమ్మాయిలు ఈ వయస్సులో ప్రేమలో పడకుండా కష్టపడి చదువుకుంటే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.